కథాకాలం : 1976

# ఎన్నెన్నో ఆత్మహత్యలు

వంటింట్లో చాప మీద మేను వాల్చిన సుందరమ్మకి ఎప్పుడు కునుకు పట్టిందో గాని, ఆవిడ లేచేసరికి నేలంతా తడి తడిగా ఉంది. ఈదురు గాలికి కిటికీ రెక్కలు కొట్టుకుంటున్నాయి. లోపలికి వాన జల్లు పడుతూంది.

సుందరమ్మ నిద్రావస్థలో అయోమయంగా చుట్టూ చూసి బైట హోరున వాన పడుతూందని అర్థం చేసుకొని, లేచి కిటికీ తలుపు మూసి వచ్చింది. టీ కాచాలని బుద్ధి పుట్టి, పీటని స్టవ్ దగ్గరకి లాక్కొని అగ్గి పెట్టె కోసం వెతికింది.

స్టవ్ పక్కనే నేలమీద నీళ్ళలో పడి ఉంది అగ్గి పెట్టె. అగ్గి పెట్టె మీద పొడిగా ఉన్న చోట పుల్లగీయబోయింది సుందరమ్మ. అగ్గిపుల్లలు నెంబుకుని వెలగం అని మొండికేశాయి. సుందరమ్మని ఒక్కసారిగా నిస్సత్తువ ముంచెత్తింది.

వానలో తడిసిన అగ్గి పెట్టె వెలగక పోతే ఎవరిని కోప్పడాలి, వాననా? అగ్గి పెట్టెనా? నిప్పునా? నీరునా? ఎవర్ని? ఎవర్ని కోప్పడాలి? సుందరమ్మకి కోపం అయితే వచ్చింది కాని, ఎవర్ని కోప్పడాలో తెలియలేదు.

ఆ కోపంలో, నీరసంలో, నిస్సత్తువలో వెలగని స్టవ్ ముందు కాలు విరిగిన పీట మీద సుందరమ్మ దిక్కులు మరిచి పోయిన దానిలా కాసేపు కూర్చుంది.

ఎండ, గాలి, వాన - ఏది వడితే అది యదేచ్ఛగా ఇంట్లోకి జొరబడి పోయే విధంగా ఇల్లు కట్టినందుకు ఇంటాయన మీద ఆవిడకు కోపం వచ్చింది.

సంపాదించుకొనే రోజుల్లో వెనకా ముందు చూడకుండా జేబులతో సంపాదించిన దాన్ని దోసిళ్ళతో ఖర్చు పెట్టి నందుకు మృత్యుంజయ రావు గారి మీద ఆవిడకు కోపం వచ్చింది.

మృత్యుంజయ రావు గారంటే ఎవరో కాదు. సుందరమ్మని పాణి గ్రహణం చేసిన వ్యక్తి. అప్పుడాయన పాతికేళ్ళ ప్రాయంలో ఉన్న రైల్వే ఎల్. డి. సి. మృత్యుంజయ్. అప్పుడాయన అందరిలా స్వాతంత్ర్యంకోసం కలలుగన్న వ్యక్తి. రాబోయే స్వాతంత్ర్యాన్ని తలచుకొని

హాయిగా గుండె నిండా ఊపిరి పీల్చుకొన్న వ్యక్తి. స్వాతంత్ర్యం రావడం జరిగినా, అనుకున్న పెద్ద మార్పేదీ మాత్రం రాలేదని ఆయనకు తోచింది. స్వాతంత్ర్యం ముందు దేశం గురించి, ప్రపంచం గురించి ఆందోళన చెందిన అతను స్వాతంత్ర్యం తర్వాత తన గురించీ, కుటుంబ క్షేమం గురించి కలత చెందాడు. ఇలా కలతలు, కష్టాలు, కన్నీళ్ళతోనే ఏళ్ళు గడిచిపోయాయి. ఇప్పుడాయన అరవయ్యేళ్ళ "రిటైర్డ్ రైల్వే హెడ్ క్లర్క్ మృత్యుంజయరావు గారు".

రెండేళ్ళ క్రితం ఆయన రిటైరయినప్పుడు జీవికకోసం అగ్గిపెట్టెల పరిశ్రమ ఒకటి పెట్టారు. ఆ అగ్గి పెట్టెల పరిశ్రమ వల్ల ఉన్న రెండెకరాల ఆస్తికీ అగ్గి పెట్టేసి నట్లయింది తప్ప మరేం కాలేదు.

ఆ కుటీర పరిశ్రమల వల్ల ఉన్న కుటీరం, ప్రావిడెంట్ ఫండ్ డబ్బు కూడా పోయి కేవలం శ్రమే మిగిలింది. ఆయన తయారు చేసిన అగ్గి పెట్టెలు నెంబుకోకుండానే వెలిగేవి కావు మరి.

ప్రస్తుతం సుందరమ్మలో అగ్గి పెట్టె వెలగక పోవడంతో ప్రారంభమైన విసుగు పెరిగి, పెరిగి, తమ బ్రతుకుల్ని అలా వీధిలో కీడ్చిన అగ్గి పెట్టెల పరిశ్రమ మీదా. ప్రావిడెంట్ ఫండ్ డబ్బుతో కనీసం పెద్ద కూతురి పెళ్ళయినా చేయకుండా బిజినెస్‌లోకి దిగిన మృత్యుంజయరావు గారి మీదా, చివరికి పెద్ద వయసులో కూతురు టైపిస్టుగా పని చేసి తెస్తున్న రెండు వందల ఏభై రూపాయల జీతం పైన ఆధారపడి బ్రతక వలసి వస్తున్న తన దుస్థితి మీదా కోపంగా మారింది. అయితే అది ఎంతో సేపు నిలవలేదు. ఆ కోపం దుఃఖంగా మారడానికి ఎంతో సేపు పట్టలేదు.

ఆ రోజు వంటచేయడానికి స్టవ్వూ, గిన్నెలూ, తడిసి పోయిన అగ్గి పెట్టే తప్ప ఇంట్లో బియ్యం, కూరలూ, పప్పులు, సరుకులూ లేవన్న సంగతి ఆవిడకు గుర్తు కొచ్చింది.

పెద్ద కూతురు జీతం అందడానికి పది రోజులు ముందున్నదని గుర్తు కొచ్చింది. చిన్న కూతుర్ని కాలేజీలో చేర్పించడానికి డబ్బు లేదన్న సంగతి గుర్తు కొచ్చింది.

ఇవన్నీ గుర్తుకు రావడంతో ఆవిడ కొక్కసారిగా దుఃఖం ముంచుకు వచ్చింది.

అంతలో "ఎందుకీ ఏడుపులు? నేను కూడా చచ్చిం తర్వాత ఎలాగూ అవి తప్పవు. అంత వరకూ కాస్తా దిగ మింగుకో" అన్న పెద్ద కూతురు రాధ కంఠం విని వెనక్కి తిరిగిందావిడ.

రాధ విసురుగా అక్కణ్ణించి వెళ్ళి మూలన చిలకొయ్యకి తగిలించి ఉన్న గొడుగు తీసుకొని వీధిలోకి నిష్క్రమించింది. "ఎక్కడికే... ఆదివారం పూట?" అని అడుగుతున్న సుందరమ్మకి సమాధానం చెప్పకుండా.

సుందరమ్మ అలా వెడుతున్న కూతురికేసి చూస్తూ వీధి గుమ్మానికి చేరగిల బడింది.

బయట వాన తగ్గింది. పైన ఆకాశం అంతా దట్టంగా మబ్బు పట్టి లోకం మీద నల్లటి దుప్పటి కప్పుతున్నట్లుంది.

ఎక్కడో ఓ ఉరుము ఉరిమింది. ఓ మెరుపు మెరిసింది.

అంతలో "అక్క ఎక్కడి కెళ్ళిందే" అంటూ వచ్చింది సుజాత.

"ఏమో, తల్లీ! నేనడిగాను. అది సమాధానం చెప్పలేదు" అంది సుందరమ్మ.

"ఒక వేళ డబ్బు పట్రాడానికే నేమో!"

"అయిపోయినప్పుడల్లా తెచ్చుకోడానికి డబ్బు మార్కెట్లో రాసులు పోసి అమ్మే వస్తువు కాదు".

ఆ పిల్ల కాలి బొటన వేలు నేల మీద రాస్తూ గోడకానుకొని నిలబడింది.

"కాలేజీ నాలుగు రోజుల్లో తెరుస్తారు. రేపు డబ్బు కట్టి అడ్మిషన్ ఫారాలు తెచ్చుకోవాలి. నా ఫ్రెండ్సంతా చదువుతున్నారు. నాకూ కూడా చదువుకోవాలనుంది".

తనలో తను గొణుక్కుంటున్నట్లుగా అంది..

"పెద్ద పిల్లవయ్యావు. పరిస్థితులు కాస్త అర్థం చేసుకునే ఈడొచ్చింది. అయినా, ఇంకా చెప్పిన మాట వినకుండా మారాం చేస్తే ఎలా? చదువు మీద శ్రద్ధ ఉన్నంత మాత్రానే డబ్బు లేని వాళ్ళకి చదువు ఎలా వస్తుంది?" అని అనునయంగానూ, మృదువుగాను 'నిన్ను చదివించ దలచుకోలేదు' అన్న భావాన్ని వ్యక్తం చేసింది సుందరమ్మ.

దానితో సుజాతకు దుఃఖంతో కూడిన కోపం ముందుకు వచ్చింది.

"అయితే నన్నింక చదువు మాన్పించేస్తారా?" నన్ను పీక నులిమి చంపేస్తారా? అన్నట్టుగా భయం భయంగా అడిగింది.

ఆ ప్రశ్నకి మరి సమాధానం చెప్పాలనిపించలేదు సుందరమ్మకి.

"నేను ఎక్కడన్నా ఉద్యోగం చేసి చదువుకుంటాను." అంది సుజాత అభిమానంగా.

సుందరమ్మ కూతురికేసి చిత్రంగా చూసింది. ఆమె కెందుకో కాని ఈ పిల్ల భవిష్యత్తులో చాలా కష్టాలు పడుతుందనిపించింది. అభిమానాన్ని, ఆశల్ని చంపుకుని పరిస్థితులు ఆడించినట్లల్లా మర బొమ్మలా ఆడలేని మనుషులు ముఖ్యంగా వాళ్ళు ఆడవాళ్ళయితే జీవితంలో చాలా కష్టాలపాలవుతారని ఆవిడ అనుభవ పూర్వకంగా తెలుసుకుంది.

అందుకే చదువుకుంటానంటూ మారాం చేస్తున్న కూతురికేసి పిచ్చి తల్లీ, అన్నట్లు చూసింది.

సుజాత మాత్రం కాళ్ళు నేలకేసి బాదుతూ రాగం అందుకుంది, జుట్టు పీక్కుంది. దొడ్లో నూతి పళ్ళెం దగ్గిర కూర్చుని తల్లిని, తండ్రినీ, అక్కనీ శాపనార్థాలు పెట్టింది. ఆ తరువాత కాస్సేపటికి దుఃఖం మరిచిపోయింది.

నూతి పళ్ళెం పక్కన బట్టలుతికే రాతి మీద చేయి గడ్డం కింద పెట్టుకుని పైన మబ్బు విడని ఆకాశంకేసి, కింద చిత్తడి చిత్తడిగా ఉన్న నేలకేసి, నూతి పక్క వర్షంలో స్నానంచేసి తలార బెట్టుకుంటున్నట్లు నిలబడ్డ అరటి చెట్టు కేసి చూస్తూ ఆలోచిస్తూ, మధ్య మధ్య నిట్టూరుస్తూ ఆర్టిస్టు లెవరన్నా చూసి ముచ్చటపడి బొమ్మ గీయ దగ్గ ప్పోజులో కూర్చుంది.

అంతలో ఆమెకి "హాయ్" అన్న కంఠం వినబడింది. తల తిప్పి చూసిన సుజాత కూడా "హాయ్" అంది.

ఆ పక్క వాటాలో ఇంటివారుంటున్నారు. వాటా అనడంకన్న అదే ఇల్లనడం సబబు. అది ఒకానొకప్పుడు పెంకుటిల్లు. పుణ్యమూర్తిగారు ఆ పెంకుటింట్లో ఉంటున్నప్పుడే బట్టలకొట్టు తెరిచారు. వ్యాపారం పెరుగు తున్నకొద్దీ అంతస్తు పెరుగుతున్నకొద్దీ ఆయన ఆ ఇంటిని అనేక రకాల మార్పు చేసి ఇప్పుడు దాన్నో చక్కని డాబా చేశారు. ఆ పక్కన చిన్న కారు షెడ్డూ, ఓ స్టోర్ రూము కూడా కట్టారు. అయితే, ముందు ముచ్చట కోసం కారుషెడ్డు కట్టినా, ఆ తరువాత స్టోర్ రూమునీ, కారు షెడ్డునీ, ఆ పక్క రెండు గదుల్నీ కలిపి ఓ వాటా కింద చేసి అద్దె కివ్వ వచ్చు నన్న ఆలోచన వచ్చిన తరువాత ఆయన మృత్యుంజయరావు గారికి ఆ వాటాని డెబ్బై రూపాయలకి అద్దె కిచ్చారు. అదిప్పుడు వంద రూపాయ లయింది. మృత్యుంజయరావు గారు ఖాళీచేస్తే అద్దె పెంచి మరొకళ్ళ కివ్వాలని ఆలోచన కూడా ఆయనకుంది.

ప్రస్తుతం అక్కడ ఇంటివారబ్బాయి రాజు నిలబడి పాలు తాగు తున్నాడు. చల్లటి ముసురులో వేడి వేడి పాలు తాగుతున్న గొప్పని కళ్ళలో నింపుకు మరీ తాగుతున్నాడు.

మూడు రోజుల నుంచి ఏక టాకీగా ఉన్న ముసురువల్ల శరీరానికి చలి తగల కుండా అతను ఒంటి మీద రంగు రంగుల ఉన్ని స్వెట్టర్ తొడుక్కున్నాడు. అయితే, అది కేవలం చలి కోసమే గాక అందం కోసం, ఫాషన్ కోసం కూడా తొడిగానని తెలియజేయడంకోసం కాలరు దగ్గిర జీప్‌ని కొంచెం కిందికి ఛాతీ మీదికి లాగ్ చేశాడు.

అతను సుజాతని చూసి - అరె .... నా కింత దగ్గిర్లో మల్లె తీగ, మాలతీ లత ఉందని తెలీదేఅని ఆశ్చర్యపోయాడు. తనతో చిన్నప్పట్నించి

కలిసి తిరిగి, కలిసి ఆడుకున్న ఓ అమ్మాయి ఇంత చక్కగా "నా గాల్ ఫ్రెండ్" అని తను గర్వంగా చెప్పుకొనడానికి వీలుగా ఎదిగినట్లు ఇంత కాలం ఎందుకు తెలియలేదని కూడా అతను ఆశ్చర్యపోయాడు.

ఏడాది క్రితం అతనికి పరీక్షలు, మార్కులు, ప్రోగ్రెస్ రిపోర్టులు, సరిగ్గా చదవకపోతే ఈ వెధవ ఇండియాలోనే పడేడవ వలసి వస్తుంది - చస్తే అమెరికా వెళ్ళలేవు - అన్న తన తండ్రి గారి తిట్లు తప్ప మల్లెపూలు, సన్న జాజులు, మాలతీ లతలంటే తెలీదు. ఈ మధ్యనే లక్షల ఆస్తి గల తండ్రిగారి ఏకైక సంతానాన్ని అనుకోవడం మొదలుపెట్టిన అతను - అందాలును పైట లాగి అల్లరి పెట్టడం మల్లెపూలను తనివితీరా వాసన చూసి నలిపెయ్యడం, సంపెంగలను రేకులు విరిచెయ్యడం, మాలతీ లతల్ని తెంపెయ్యడం గురించి ఆలోచిస్తున్నాడు.

సుజాతని చూసినప్పుడుకూడా అలా అనుకోవడంవల్ల కలిగిన హాయి .... చేతనే అతను హాయ్ అని విష్ చేశాడు.

"ఏమిటోయ్? అలా ఉన్నావు?" అని అడిగాడు.

"నన్ను చదువు మానిపించేస్తారట, రాజా?" అంది సుజాత దిగులుగా.

"వ్వాట్? వ్వాట్? వ్వాట్?" అని రాజు ఇప్పుడిప్పుడే చాలా శ్రద్ధగా రేపు అమెరికాలో తెల్ల మొహం వేయనవసరం లేకుండా నేర్చుకుంటున్న పర భాషలో తన ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. అయితే, చల్ల చల్లని ఈ ముసురులో కలిగే నులి వెచ్చని కోరికలని తీయ తీయగా చెప్పుకుని హాయ్ హాయ్‌గా నవ్వుకోవలసిన సమయంలో సంతాపాలు, సానుభూతులతో ఈ సంభాషణ ప్రారంభమైనందుకు చావు బాజా విన్నట్టుగా అతను చిరాకు చెందాడు. అయితే, తన చిరాకుని పైకి కనబడనీయకుండా -

ప్ప, అని సానుభూతిని ప్రకటించాడు. ఆ తరువాత ఏం చెయ్యాలో తెలియలేదు. మౌనంగా ఉండిపోయాడు.

సుజాత అతన్ని చూసి "సారి రాజా! .... నా బాధేదో నన్ను పడనీ, నీకనవసరంగా చెప్పాను. నువ్వేం చెయ్యగలవు, నేను చదువు మానెయ్యాలసి వస్తే. ఎవరైనా కానీ ఏం చేయగలరు? సారీ" .... అంది.

"కాలేజీ లైఫ్ బాగుందా"? కాలేజీ నించి ఇంకా తేరుకోని సుజాత ఉత్సాహంగా అడిగింది.

కాలేజీ పేరు వినగానే ఆ స్టూడెంట్ హృదయం ఏరు పొంగినట్లు పొంగింది. తను స్నేహితుల్ని రకరకాలుగా పిలవడంకోసం వాడే "బే", 'గురు' లాంటి పదాలన్నీ గుర్తుకు వచ్చాయి. తాము లెక్చరర్లని పాఠం చెప్పనివ్వకుండానూ, ఆడపిల్లల్ని అల్లరి పెట్టడానికి చేసే చేష్ట లన్నీ గుర్తుకు వచ్చాయి. ఈ మధ్యనే ఓ సారి తాను ఓ అమ్మాయి మీదికి సిగరెట్ విసిరితే, కాళ్ళకు చెప్పుల్లేని ఆ బీద పిల్ల చూడకుండా దాన్ని తొక్కేసి కెవ్వున అరిస్తే తన స్నేహితులంతా పగలబడి నవ్వి చప్పట్లు చరచి తనని హీరోవిరా అని మెచ్చుకోలుగా చూసిన సంఘటన గుర్తుకు వచ్చింది.

ఇవన్నీ ఇలా గుర్తుకు రావడంతో, "జీవితాంతం కాలేజీలోనే ఉండి పోవాలనిపిస్తోంది" అన్నాడు రాజు.

"అదేమిటి, రాజా? జీవితాంతం కాలేజీలో ఉండిపోతే ఎలా? పరీక్షలు పాసవ్వా మరి?" అని అడిగింది సుజాత కళ్ళు చక్రాల్లా తిప్పి.

పరీక్షపాసవకుండా నైనా సరే కాలేజీలో ఉండిపోతాను - అని చెబు దామనుకుని, అంతలో తన తండ్రి మరి అమెరికా వెళ్ళవా? అని

గడ్డుకిమి ప్రశ్నించినట్టు కలగని ఆ సమాధానాన్ని వెంటనే ఉపసంహ రించుకుని పైకి నవ్వేశాడు రాజు.

రాజు నవ్వినందుకు సుజాత కూడా పాదాలు కింద నూతి చెప్టామీద వర్షం నీటిలో ఆడిస్తూ నవ్వేసింది.

ఇద్దరూ అలా కాస్సేపు నవ్వుకున్నారు. అంతలో రాజు హఠాత్తుగా నవ్వులాపి గంభీరంగా అయిపోయాడు. నవ్వుతున్నప్పుడు సొట్టలు పడుతున్న సుజాత బుగ్గలకేసి చూస్తూ ఉండిపోయాడు.

"అదేమిటి, రాజూ, అలా చూస్తూ ఉండిపోయావ్?" అని అడిగింది సుజాత.

"అలా చూస్తూ ఉండిపోవాలనిపిస్తోంది సుజాతా?" అదేదో సినిమాలో అదేదో సీన్లో అదేదో హీరోలా నిట్టూర్చాడు రాజు.

సుజాత ఆశ్చర్యంతో కనురెప్పలు టప టప లాడించలేదు. దిగులుతో నిట్టూర్చింది.

"నా అందం నీ కొచ్చి, నీ డబ్బంతా నా కొచ్చి ఉంటే ఎంత బాగుం టుంది రాజా!" ఏళక్తో అనిపించినట్టుగా దిగులుగా, అమాయకంగా అడిగింది.

"అలా అయితే, నా డబ్బంతా నీకిచ్చేస్తాను. నీ అందం అంతా నా కిచ్చేస్తావా మరి?" అని గడుసుగా, సొగసుగా అడిగాడు రాజు.

సుజాత అందులోని చెడర్థాల కోసం వెతకలేదు గానీ అదో మోసకారి యువకుడు మరో అమ్మాయితో అన్న మోసకారి మాట అని పోల్చి రాజు కళ్ళలోకి చురుగ్గా చూసింది.

ఆ తరువాత తనతో చిన్నప్పటినించి కలసి ఆడుకొన్న గొప్పింటి బిడ్డడని అతణ్ణి క్షమించేసింది. సుజాతనించి తిరుగు సమాధానం ఏదీ రాకపోవడంతో రాజు కొంచెం ధైర్యం పుంజుకొన్నాడు. చేత్తో సున్నితంగా జుట్టు సరిచేసుకొన్నాడు. "అవును, సుజాత .... నువ్వు చాలా మారిపోయావు .... ఎంతో అందంగా ఉన్నావు .... చూడు - నీ జాకెట్టు నీ శరీరానికి ఎంత బిగుతుగా అతుక్కుపోయిందో ...."

సుజాత అప్పుడతనికేసి తీక్షణంగా చూసింది.

అవును నా జాకెట్టు ఇరుకయిపోయాయి. ఉన్న రెండు ఓణీలు ఇంట్లో కూడా తొడిగేస్తే చిరిగిపోతాయని చెప్పి వేసుకోవటంలేదు. నేను మీలా ఉన్నింటి బిడ్డనుకాను. మా అక్క నెల జీతం మీ నాన్న బట్టల కొట్లో రోజువారి లాభం అంతకూడా ఉండదు - అని చెబుదామనుకుంది.

అలా చెబుదామనుకున్నంతలో ఆమెకు మాటలు రాలేదు. కన్నీళ్ళు వచ్చాయి. ఆమె కన్నీళ్ళు చూసి రాజు ముందు గాబరా పడి, ఆ తరువాత తేరుకొని ముఖానికి నవ్వు పులుముకుని - అరే .... అదేమిటి, సుజీ .... చదువు మానెయ్యమన్నారని అంతలా ఏడుస్తారా ఎవరన్నా .... ఛీ .... ఛీ .... అని అనునయించి, చూడు .... నీకు కాలేజీలో చదువుకయ్యే డబ్బంతా కావాలంటే నేనిస్తాను, అలా ఏడవకు అన్నాడు.

సుజాత చివాల్న లేచి, కళ్ళు తుడుచుకుని ఇంట్లోకి వేగంగా వచ్చేసింది. వంటింట్లో తల్లిపక్కన గోడకానుకొని కూర్చుంది.

నాకు చదువుకోడానికి రాజు డబ్బిస్తాట్ట. ప్రతిఫలంగా నేను నా అందం ఇవ్వాలని అడుగుతాడు కాబోలు అనుకొంది మనసులో. ఆమెకెందుకో నవ్వు వచ్చింది.

ఆ రోజంతా అన్నం తినలేకని, వంట అయ్యే దారి లేదని జ్ఞాపకం రావడంతో నీరసం ఒక్కసారిగా ముంచెత్తినట్లయి నేలమీదికి అలాగే ఒరిగి పోయింది.

అంతలో అక్కడికి మృత్యుంజయరావు గారు వచ్చారు. "ఆకాకర కాయ కూర, తినాలనుందే, మనిషీ" అంటూ. పెళ్ళాన్ని పేరు పెట్టి పిలవడానికి ఆయనకి అభిమానం అడ్డు వస్తుంది. "మనిషీ" అని పిలవడం అలవాటు. అలా పిలవద్దని పెళ్ళయిన కొత్తలో సుందరమ్మ కోరింది. ఆ తరువాత భర్త తనని ఏ పేరుతో పిలిచినా ఓయ్ అనడం నేర్చుకొంది తప్పనిసరిగా.

ఈ పెద్ద వయసులో వేరే దారిలేక కూతురి సంపాదన మీద కుటుంబ భారాన్ని మోపి, తనకంటూ ప్రత్యేకంగా వేరే ఓ లోకం ఏర్పరచుకొని అందులో బ్రతికేస్తున్నాడు గానీ---

తన యౌవ్వనంలో స్త్రీ విద్య, స్త్రీ స్వేచ్ఛ లాంటి పదాలు విని కలికాలం అని పెదవి విరిచేవాడు మృత్యుంజయ రావు. "న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి .... అని మను ధర్మ శాస్త్రం ఘోషిస్తూంటే ...." అంటూ తరచూ ఇంట్లో.... అప్పుడప్పుడు బయటా ఉపన్యాసాలిస్తూ ఉండేవాడు.

సుందరమ్మ . ఆకాకరకాయ కూర తినాలనుందే మనిషీ అన్న భర్త మాట విని - హమ్యో రాత అని నిట్టూర్పు విడిచింది. "గత జన్మలో చేసుకొన్న పాపాలు ఈ జన్మలో ఇలా కోరికల రూపంలో మనల్ని పీడిస్తాయి." అంది. 'మీకేమన్నా పిచ్చా? వెర్రం దవతలకి' అని చీత్కరించింది.

"ఆ కాకరకాయ కూర తినాలనుకోవడం పిచ్చెక్కిందనడానికి నిదర్శనమా?" అని మృత్యుంజయరావుగారు ముందు హాస్యం ఆడబోయి, భార్య సరైన మూడ్‌లో లేదనుకుని అపహాస్యం పాలవకుండా ఉండేందుకే హాస్యమాడే యోచన అంతటితో విరమించారు.

తండ్రి కోరిక విన్న సుజాత హయ్యో నీ దెంత చిన్న కోరిక అని మనసులో అనుకుని ఆశ్చర్యపడింది.

జీవితంలో చిన్న చిన్న కోరికలు కూడా తీరని వాళ్ళని పెద్దగా నిరాశ ఆవరిస్తుందని, ఆ నిరాశే సామాన్యులను ఏ నీచానికైనా ఉసిగొల్పుతుందని ఆమె కనిపించింది. అలా నిరాశ ఆవరించినప్పుడు అసామాన్యులు మాత్రం చిన్న చిన్న వాళ్ళే అయినా, పెద్ద పెద్ద వాళ్ళకి వ్యతిరేకంగా ఉద్యమించి అలజడులు చేస్తారని ఎక్కడో చదివిన గుర్తుంది. ఆమెకి పురుషులందు పుణ్య పురుషులు ఎలాగయితే వేరుగా ఉంటారో, అలాగే పుస్తకాలలో వచ్చే నిజాలు చెప్పే పుస్తకాలు వేరుగా ఉంటాయని ఆమె అనుకుంది.

సుందరమ్మకి ఆ రోజు వంటచేసే దారి లేదని కట్టుకున్న మొగుడికి ఎలా చెప్పాలో తెలియలేదు. బాధ పెట్టే నిజం తెలియని మనిషిని ఆ నిజం చెప్పి బాధపెట్టడం ఇష్టం లేక ఆమె క్లుప్తంగా - "ఇంకా వంట చేయలేదు. అన్నీ నిండుకున్నాయి. పెద్దది డబ్బుకోసం కాబోలు ఎక్కడికో వెళ్ళింది. ఎవర్నడిగి తెస్తుందో మరి" అని మాత్రమే అంది. మృత్యుంజయరావు గారు ఆ మాట విని "హరి" అని పెద్దగానూ, నిర్లిప్తంగానూ నిట్టూర్చి తువ్వాలు భుజం మీద వేసుకుని స్నానానికి దొడ్లో బావికేసి కదిలారు. స్నానం తరువాత సంధ్యావందనం చెయ్యడం ఆయన ఇటీవలే నేర్చుకున్న కొత్త విద్య.

అంతా న్యూస్ పేపరు చదివే వేళ ఆయన భక్తి పాటల కోసం రేడియో బరాబరా తిప్పేస్తాడు. శంకరమఠం దాకా నడుచుకుంటూ వెళ్ళి దేవుడి ముందు లెంపలు వేసుకుని ఓ అరగంట అక్కడ కూర్చుని వస్తాడు. అలా అక్కడ కూర్చున్నప్పుడల్లా జీవితంనించీ, పేదరికపు బాధలు భయాలనించీ పారిపోవాలనుకుంటున్న తనకి గమ్యం దొరికినట్లనిపిస్తుంది. ముక్తి అంటే అదేనని అతను తనకు తాను అర్థం చెప్పకుంటాడు.

మృత్యుంజయరావు గారికి ఆ రోజు బాగా ఆకలి వేస్తున్న మాట నిజం. అందుచేత స్నానం, సంధ్యా వందనం త్వరగా ముగించుకుని వచ్చాడు. అప్పటికి మధ్యాహ్నం రెండు గంటలు దాటింది. బయట నీరెండ కాస్తోంది.

ఆయన లోపలికి వచ్చి తడి తువ్వాలు పిండి దండానికి ఆరేసేటప్పటికి లోపల రాధ గొంతు వినిపించింది. ఇదొచ్చిందన్నమాట అనుకున్నాడాయన మనసులో. అంతలో "త్వరగా తెమలండి .... బజారు కెళుదురు కాని......ఆ గాకరకాయలో, సింగినాదమో....అవేవో త్వరగా తెస్తే పొయ్యి మీద గిన్నె తగలెడతాను," అంటూ భర్తని తొందర పెట్టింది సుందరమ్మ.

"ఏమిటి? హఠాత్తుగా నీమూడ్ మారిపోయింది?" అని అడిగాడాయన నవ్వుతూ. సుందరమ్మ వోసారి గుప్పిట తెరిచి మళ్ళా మూసింది.

"ఎంత"? అని అడిగాడాయన, "ఎక్కడిది?" అని అడగలేడు.

రెండు వందలు అని చెప్పి, వో పది రూపాయల నోటు, కూరగాయల సంచి ఆయన చేతి కందించిందావిడ.

కాలేజీలో చేరతానే, నాకు చదువుకోవాలనుందే, అక్కా ప్లీజ్ ...."
అంటూ సుజాత రాధ వెనక గునుస్తూ ఆమె గదిలోకి వెళ్ళింది.

"అలాగే" రాధ ముక్తసరిగా అని మంచం మీద మేను వాల్చింది; అలిసి పోయినట్లుగా.

సుజాత వెంటనే వాయువేగ మనోవేగాలతో వచ్చి తల్లి మెడని చుట్టేసింది.

చేతిలో చిన్న సైజు ట్రాన్సిస్టరు పట్టుకుని హిందీ పాటలు వింటూ, కూని రాగాలు తీస్తూ పచార్లు చేస్తున్న రాజు గుమ్మంలో నిలబడ్డ మల్లె తీగ, మాలతీ లత సుజాతని చూసి సంతోషంగా ముఖం పెట్టాడు.

"మీ నాన్న ఏడీ?" అని అడిగింది సుజాత.

"ఎందుకు?" అని అడిగాడు రాజా.

"ఇంటద్దె ఇవ్వడానికి."

"ఇలా ఇయ్యి."

"ఇవ్వను."

"ఏం?"

"ఏ అమాయకపు అసహాయపు ఆడ పిల్లనో చదువుకోసం డబ్బు ఇస్తానని మభ్యపెట్టి మోసం చెయ్యడానికి నీకు డబ్బు కావాలి! అందు చేత తిరా ఇది మీ నాన్నగారికి అందుతుందో, అందదో?"

"అలాంటి అవసరాలకి నాకు వేరే డబ్బుంది. మా నాన్న డబ్బే అక్కరలేదు," అని రోషంగా తల ఎగరేశాడు రాజు.

"సరే ఇంతకీ ఇంటద్దె డబ్బు నాకిస్తావా?" అని అడిగాడు.

"మీ నాన్నకే ఇస్తాను. నీ కివ్వను. మరో విషయం - రేపు నేను కాలేజీలో చేరుతున్నాను." అని చెప్పి విసవిసా, చెకచకా నడుచుకుంటూ అక్కణ్ణుంచి ఇంటివేపు వెళ్ళిపోయింది సుజాత.

నీ డబ్బు అవసరం లేకుండానే కాలేజీలో చేరుతున్నా లేవోయ్ అని సుజాత అన్నట్లు రాజుకి తోచింది.

నీ డబ్బు నాకక్కరలేదు. నా అందం నీకివ్వను అనికూడా కటాకట్ మంటూ సుజాత చెప్పేసినట్లు అతని కనిపించింది.

ఈ హైదరాబాద్ వగరంలో తమ ఇంట్లో నెలకి వంద రూపాయలకి అద్దెకుండే రిటైర్డ్ రైల్వే హెడ్ క్లర్కు గారమ్మాయి - బీద పిల్లే అయినప్పటికీ, ఇరుకు బట్టల్లో బిగుతుగా కనిపించే చిన్నది - నిజం, "రాజా.... నేను దురదృష్టవంతురాల్ని రాజా అవును, రాజా నేనింకా మరి నా చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టెయ్యాలని ఇంట్లో చెప్పారు, రాజా" అని దీనంగా మొరపెట్టుకొన్న అమ్మాయి - నేను కూడా కాలేజీలో చేరుతున్నా లేవోయ్ అని అంతలోనే నిటారుగా, దీటుగా నిలబడి చెప్పడం లక్షల తండ్రి గారికి - రేపు లక్షన్నర ఖరీదుచేసే ఆ కొడుక్కి ఇష్టం లేకపోయింది.

తమ ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా లోకం ఇలా మారిపోతున్నందుకు అతనికి బాధ వేసింది. "వెదవ ఇండియా" రేపో మాపో అమెరికా వెళ్ళిపోవాలని గట్టిగా అనుకుంటున్న అతను చీత్కారంగా గొణుక్కొన్నాడు.

మెయిలింజనులా మరి ఆగకుండా, వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోతున్న సుజాతవంక అసహనంగా చూస్తూ అతను వీధి తలుపుల్ని దడాల్న వేసేశాడు. అంతటితో మనసు కుదుట పడక కసి కసిగా లోపల గడియ పెట్టేశాడు.

ఆ రాత్రి చాలా తొందరగా చీకటి పడింది.

వర్షం తగ్గింది కాని ఆకాశం ఇంకా ఉరుముతూంది. ఏ క్షణంలో నయినా మళ్ళీ వర్షం కురిపిస్తా మంటున్నాయి మేఘాలు. ఈదురుగాలి ఈసురోమంటూంది.

రాధ తన గదిలో నిద్ర పట్టక పక్క మీద అటూ ఇటూ కదిలింది. అప్పుడెప్పుడో చిన్నప్పుడు పక్కింటి మాస్టారబ్బాయితో ఆడుకొన్న బొమ్మల పెళ్ళి, ఆ తరువాత ఎప్పుడో దొడ్లో తడికెల మాటున స్నానం చేస్తున్న తనని ఇంటి ఎదురుగా మేడమీది నించి వో జత మగ కళ్ళు చూస్తున్నట్టు పసిగట్టి నాలుగు రోజులు అన్నం మానేసి పస్తు పడుకోవడం, ఆ తరువాత మరెప్పుడో కాలేజీలో చదువుతున్నప్పుడు "వీనస్ వస్తోందిరా" అని తనచుట్టూ గుస గుసల్ని విని లోపల మురిసిపోవడం, పైకి గాంభీర్యం ప్రదర్శించడం, ఆ తరువాత ఓ రాత్రి కాలేజీ యానివర్సరీ రోజున స్టూడెంట్స్ యూనియన్ జాయింట్ సెక్రటరీ ముద్దు కృష్ణతో పరిచయం కావడం, ఆ రోజు తనను జావా మీద తనని ఇంట్లో దిగబెట్టడం, ఆ తరువాత కూడా అతను తనని చాలాసార్లు తన జావా మీద తిప్పడం, ఎన్నోసార్లు అతని రూంలో తను అతనితో ఎన్నెన్నో మధుర క్షణాలు గడపడం, జీవితం కలలా గడిచి పోవడం, ఆ తరువాత తండ్రి రిటైరు కావడం, అగ్గిపెట్టెల పరిశ్రమ దివాళా

 గూడుబాలని సుఖం

తియ్యడం, ముద్దుకృష్ణ తన జావాతో సహా పూర్తిగా కనిపించడం మానెయ్యడం, తను ఉద్యోగంలో చేరడం, ఏళ్ళు గడవడం, ఏడవడం, నవ్వడం, బాధపడడం - ఎన్నో మరెన్నో క్షణాలు గుర్తుకు వచ్చి ఆమె నిద్ర పట్టని ఆలోచనలతో అలా మంచం మీద పడుకొని ఉండగా "తల నొప్పి ఇంకా తగ్గలేదా అక్కా?" అని సుజాత అడిగింది.

"అన్నం తినక్కా - తలనొప్పి తగ్గి పోతుంది" అంది.

లే, అక్కా రా. అన్నం తిను" అని తొందర పెట్టింది.

అప్పుడు రాధ "నాకక్కర్లేదు నేను తినను" అంది విసుగ్గా.

"అసలేం జరిగిందక్కా? ఎందుకు తినవు? ఒంట్లో ఎలా ఉంది? చెప్పవూ?" అని రాధ గడ్డం పట్టుకుని అడిగింది సుజాత.

రాధ చివాలున లేచి సుజాత చేతి లోంచి అన్నం కంచం లాక్కుని గోడకు విసిరేసింది.

కంచం గోడకి కొట్టుకొని నేల మీద పడి అసహాయంగా చూస్తూండి పోయింది.

రెండు అన్నం కరుళ్ళు ఆత్మ రక్షణ కోసం అన్నట్టుగా మోడా వెనక దాగుకొన్నాయి.

కంచం విసురుకి టేబిల్ మీద కదిలిన మజ్జిగ గ్లాసు కింద పడి పోకుండా నిలదొక్కుకుంది.

"ఇప్పుడు సరదా తీరిందా? నన్ను విసిగించక అవతలకి వెళ్ళు. నాకు తల నొప్పిగా ఉంది." అని రాధ కసిరింది. ఆమె కళ్ళు కోపం వల్లనో

రాధ వల్లనో ఎర్రగా ఉన్నాయి. సుజాత ఓ క్షణం బిక్క చచ్చి పోయినా, తిరిగి తేరుకుని వేగంగా గదిలోంచి బయటకి వచ్చేసింది.

లోపల రాధ విసురుగా గడియ బిగించుకుంది.

ఆ రాత్రి లోకం అదమరచి నిద్రిస్తున్న వేళ సుందరమ్మ నిద్ర పట్టక పక్క మీద ఆలోచనల భారంతో కళ్ళు తెరిచి చీకట్లోకి చూస్తూండి పోయింది. అర్థ రాత్రి వేళ వో సందేహం ఆమెని వదలకుండా పీడిస్తూంది.

రాధకి ఇంత డబ్బు .... అంత తొందరగా ఎలా ఎక్కణ్ణించి వచ్చింది? ఇందాక రాధ బయటనించి రాగానే తను ఆ మాట అడిగింది. "నన్ను విసిగించద్దు. తలనొప్పిగా ఉంది. నా గదిలో కెవరూ రాకండి" అని చెప్పి వెళ్ళిపోయింది రాధ. తానింక ఆ సంగతి పొడిగించలేదు. ఇప్పుడాలోచిస్తుంటే అంతా అయోమయంగా ఉంది. ఊహ కందకుండా ఉంది.

భర్తని నిద్రలేపి ఆయనతో ఆలోచనచేసి ఇప్పటి కిప్పుడే ఈ వ్యవహారం ఏదో తేల్చేయాలని ఆమె మనసులో గట్టిగా అనుకుంది.

ఆ ఆలోచన వచ్చిన తరువాత పక్క మీదనించి లేచింది. మృత్యుంజయరావుగారు పడుకునే స్టోర్ రూమ్‌కేసి అడుగులు వేసింది.

స్టోర్ రూమ్‌లో మృత్యుంజయరావుగారు నిద్ర పట్టని ఆలోచనలతో సతమతమౌతున్నారు.

కూతురు బయటి కెళ్ళిన రెండు గంటల్లోనే అంత డబ్బు ఎలా తేగలిగిందో ఆయనకి అంతుబట్టలేదు. అందుగురించి ఆ తరువాత సుందరమ్మ వివరం చెబుతుందని ఆశించాడు కాని, అలా జరగలేదు.

ఇంత కాలం కూతురు సంపాదన మీద ఇల్లు గడుస్తున్నా, ఇంటి వ్యవహారాలు మాత్రం (తన సిగరెట్లకీ, వక్క పొడికికూడా కూతురి ముందు చేయిచాచ నక్కర లేకుండా) భార్యే చూస్తున్నది.

అందుచేత తను ఏ విషయాలూ పట్టించుకోకుండా అంటీ ముట్టన ట్లుగా కాలం గడుపుకొస్తున్నాడు. తన కంటూ ప్రత్యేకంగా ఓ లోకం సృష్టించుకున్నాడు. అందులోంచి కాలు బయటపెడితే తిరిగి తన లోకం లోకి రాలేడు.

కాని ఇలా అట్టే కాలం సాగదని, ఏదో ఓ రోజు తనపరువు నడి వీధిలో పెక్కుతుందని ఆయన కెందుకో అనిపించింది.

ఇలా చూస్తూ కూచోలేను అనుకొన్నాడాయన. ఇప్పుడే రాధని నిలబెట్టి అడుగుతాను అని మనసులో తీర్మానించుకొన్నాడు.

పక్కమీది నించి లేచి రాధ గదివేపు అడుగులు వేశాడు.

లోపల గదిలో ఈదురుగాలికి కిటికీ రెక్కలు కొట్టుకొంటుంటే రాధకి మెలకువ వచ్చింది. లేచి లైటు వేసి కిటికీ తలుపులు మూసి అలాగే కిటికీలో కూర్చుంది. చుట్టూ చూసింది.

ఇందాకా తను విసిరేసిన కంచం, టేబిల్ మీద మజ్జిగ గ్లాసు, మోదా చాటున రెండు అన్నం కరుళ్ళు, గది అంతా మెతుకులు.

రాధకి మళ్ళా ఆకలి వేసింది.

తలుపులు తెరిచి స్టోర్ రూము వేపు రెండడుగులు వేసిన సుందరమ్మ మనసు ఆగమంటే ఆగిపోయింది.

ఏ భయంకర యథార్థమో, భయంకరం కాకపోయినా మామూలు నిజమో తెలుసుకొని ఏయే మర్యాదలు మంట కలసి పోయాయో, లేక మంట కలిసి పోలేదో కూడా తెలుసుకొని విచారించి, లేక సంతోషించి ఆ పైన నువ్వేం చేస్తావు? ఇక వెనక్కి నడు - మాట్లాడకుండా పడుకో ఈ అర్థరాత్రి నీ భర్తతో చర్చించి నువ్వు సాధించేదేమీ ఉండదు. అతనింకా ఏదో బాధ్యత గుర్తెరిగి ఉన్నాడన్నది కేవలం నీ ఆశ అని కూడా మనసు ఆదేశిస్తే అలాగే వెనక్కి నడిచి పక్క మీద వాలి పోయింది.

స్టోర్ రూములో పక్క మీదినించి లేచిన మృత్యుంజయరావు గారు రాధ గదివేపు రెండడుగులు వేసి మనసు ఆగమంటే ఆగిపోయాడు.

నీ కూతురు తప్పుచేస్తే నీ బాధ్యత ఎంత? ఒప్పు చేస్తే నీ పుణ్యం ఎంత? ఆ తప్పొప్పుల వివరాలు తెలుసుకుని ఇప్పుడు కొత్తగా నువ్వేం బరువు బాధ్యతలు మోస్తావు? ఇక చాలు వెనక్కి నడు. వెళ్ళి నీ లోకం లోకి పో - అందులోంచి అడుగు కదపకు-అని మనసు హెచ్చరించడంతో ఆయన మళ్ళీ స్టోర్ రూమ్‌లోకి వచ్చి పక్కమీద పడుకుని, ఇహం మరిచిపోయే ప్రయత్నంలో కళ్ళు మూసుకున్నారు.

తన గదిలో రాధ గోడ మూల కంచాన్ని ఎత్తి, మోడాపక్క అన్నం కరుళ్ళు ఏరి కంచంలో వేసుకుని, టేబిల్ మీద మజ్జిగ గ్లాసు ఒంపి గబగబా అన్నం కలుపుకుని ఆకలిని చంపుకుని, మంచం మీద ఒరిగిపోయింది.

బయట తగ్గిందనుకున్న వర్షం మళ్ళీ కురవడం ఆరంభించింది.